ప్రజాశక్తి
సోమవారం 4 మార్చి 2024
7
అల్లూరి సీతారామరాజు



ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయండి : పిఒ

ప్రజాశక్తి-పాడేరు: ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి అభిషేక్ ఆదేశించారు. చదువు మంచి భవిష్యత్తును అందిస్తుందని విద్యార్థులకు వివరించారు. ఆదివారం కందమామిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలో మెనూను, వండుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు.విద్యార్థులకు సైన్సు పాఠ్యాంశాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న పాటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే ఆసుపత్రికి తీసుకుని వెళ్లి తగిన విధంగా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. టెన్త్ పూర్తి చేసిన తర్వాత తలితండ్రులు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడానికి ప్రయత్నిస్తారని, బాల్య దశలో వివాహం చేస్తే సచివాలయం మహిళా పోలీసులు, లేదా ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ ఆశ్రమ పాఠశాలకు హాజరు కాని విద్యార్థులపై ఆరా తీశారు. పాఠశాలల్లో డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆశ్రమాల్లో మృత్యుహేల!

- గిరిజన తల్లిదండ్రులకు గుండె కోత
- ఏడాదిలో 12 మంది విద్యార్థుల మరణం
- తరచూ పునరావృతమౌతున్న విషాద ఘటనలు
- అధికారుల పర్యవేక్షణ కొరవడడమే కారణమా?
- తప్పెవరిదైనా ...బాధితులంతా అడవి బిడ్డలే

కొండలనే నమ్ముకుని, కాయకష్టంతో జీవించే అడవిబిడ్డలు వారంతా. తమలా తమ పిల్లలు కష్టపడ కూడదని, వారు మంచి ప్రయోజకులు కావాలన్న ఆశ, ఆకాంక్షతో ఆశ్రమాలు, హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నారు. అయితే వారి ఆశలను అడియాశలు చేస్తూ, ఆశ్రమాల్లోని చిన్నారులు అనారోగ్యం బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 12మంది విద్యార్థులు చనిపోవడం సర్వత్రా చర్చనీయాంశమై, ఆందోళన రేకెత్తిస్తోంది

ప్రజాశక్తి - పాడేరు టౌన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మృత్యు ఘంటికలు మళ్లీ ఒకప్పటి పరిస్థితులను సాక్షాత్కరింప జేస్తున్నాయి. చలాకీగా కళ్లెదుటే తిరిగే చిన్నారులు అనారోగ్యానికి గురికావడం, అసువులు బాయడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 12 మంది విద్యార్థులుమృత్యువు ఒడిలోకి చేరగా, పదుల సంఖ్యలో ఆసుపత్రుల పాలై చికిత్స పొందిన సందర్భాలు న్నాయి. పదేపదే చోటుచేసుకున్న ఘటన లతో పాడేరు ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని హాస్టళ్ల నిర్వహణపై సందేహాలను లేవనెత్తుతున్నాయి.

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వాలు, పాలకులు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో తప్పెక్కడ జరుగు తోంది, బాధ్యు లెవరనే దానిపై చర్చ జరుగుతోంది. మెనా బేషుగ్గా ఉన్నా అది సరిగా అమలుకు నోచుకోక రక్తహీనత, పౌష్టికాహార లోపం తో గిరిబాలలు అనా రోగ్యం బారిన పడుతున్నారని అపవాదు ఒకవైపు వినిపిస్తుంటే, ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం ఏం చేస్తుందనేది మరో ప్రశ్న ఉత్పన్నమౌతోంది. ఇప్పటివరకు అధికారిక లెక్కల ప్రకారం 12మంది గిరిజన బాలలు మృత్యువాత పడగా, వెలుగులోకి రాని మరణాలెన్నో ఉన్నాయనేది పలువురి అభిప్రాయం. ఆశ్రమ పాఠశాలల్లో వారానికోసారి వైద్యపరీక్షలు చేయాలి. అది జరుగుతోందా? లేదా అనేది ప్రస్తుతం పరిస్థితుల్లో అనుమానాస్పదంగా మారింది. టిడబ్ల్యూ డిడి, ఎటిడబ్ల్యూఒ స్థాయి అధికారుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ నెల20న ఆశ్రమ పాఠశాలలపై అధికారులు, హెచ్ఎంలతో నిర్వహించిన సమీక్ష తప్ప, గడచిన పది నెలల్లో ఆశ్రమ పాఠశాలల వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఎటువంటి చర్యలు ఐటిడిఎ అధికారులు చేపట్టలేదనే ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలని, ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలకు అ డ్డుకట్ట వేసి, గిరిజన తల్లిదండ్రుల గుండెకోతను నివారించాలని విద్యార్థి, ప్రజా సంఘాలతోపాటు పలువురు కోరుతున్నారు.

హెల్త్ వాలంటీర్లను నియమించాలి



ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల ఆరోగ్యం, బాగోగులు చూసేందుకు హెల్త్ వలంటీర్లను నియమించాలి. హెల్త్ వాలంటీర్ల నియామకం లో ప్రభుత్వం నిర్లక్ష్యమే తాజా పరిస్థితికి కారణం. విద్యార్థుల మరణాలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.

జి.ప్రభుదాస్,
జిల్లా కమిటీ సభ్యులు, డివైఎఫ్ఐ

విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి. మరణించిన విద్యార్థులకు చెందిన కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

జీవన్ కృష్ణ,
జిల్లా కార్యదర్శిచ ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

కో-ఆపరేటివ్ బ్యాంకులను కాపాడుకుందాం

- యూనియన్ గౌరవాధ్యక్షులు అజయ్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు లను కాపాడుకుందామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. పాడేరు కోపరేటివ్ సొసైటీ సిబ్బందితో సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా నాయకులు అభిన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అజయ్ కుమార్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంటు ఉద్యమం వెయ్యి రోజులు దాటినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం స్పందించలేదని మండిపడ్డారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్ముకుంటూ పోతే భావితరాలకు సంపద ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఆ రోజున రూ.500 కోట్లతో పెట్టుబడి పెట్టి మూడు లక్షల కోట్లకు కార్మికుల కష్టంతో ముందుకు వెళ్తున్న స్టీల్ ప్లాంట్ వంటి భారీ పరిశ్రమను నరేంద్ర మోడీ ప్రయివేటుకు అప్పగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ రంగంలో నడుస్తున్న బ్యాంకులను కూడా వదిలి పెట్టలేదన్నారు. రైతుల సహకారంతో నడుస్తున్న కోపరేటివ్ సొసైటీ బ్యాంకులను ఈ ప్రభుత్వాలు వదల లేదన్నారు. కొన్ని ఆటంకమైన జీవోలు తెచ్చి జీతాలు పెంచకుండా చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కోపరేటివ్ సొసైటీల ఉద్యోగస్తులకు సీనియార్టీ బట్టి రూ.70 వేలకు తక్కువ కాకుండా జీతం ఇవ్వాలన్నారు.ఒకవైపున ధరలు ఆకాశాన్ని అంటుతున్నా జీతభత్యాల్లో పెంపుదల లేకపోవడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, కోపరేటివ్ సొసైటీ యూనియన్ అల్లూరు జిల్లా నాయకులు జి కేశవరావు, నాయుడు, రాంబాబు, ప్రసాదు, లింగమూర్తి, ఈశ్వరరావు, సింహాచలం పాల్గొన్నారు.

శిథిల పాఠశాల భవనం మరమ్మతులకు నిధులు

- 'ప్రజాశక్తి' కథనానికి ఐటిడిఎ పిఒ అభిషేక్ స్పందన



పెట్రాయి పాఠశాల భవనం, ఇన్‌సెట్‌లో ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయితీ పెట్రాయి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. పాఠశాల అధ్వానస్థితిపై గత నెల 26న 'శిథిలావస్థలో పెట్రాయి పాఠశాల భవనం' శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ స్పందించారు. పాఠశాల భవన మరమ్మతులకు రూ.3.60లక్షలను మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల భవన మరమ్మతులను వెంటనే చేపట్టి, నాణ్యతాలోపం లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల భవనం దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనం రాసిన ప్రజాశక్తి దినపత్రికకు, దీనికి స్పందించి, నిధులు విడుదల చేసిన ఐటిడిఎ పిఒకు పెట్రాయి గ్రామస్తులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపి, హర్షం వెలిబుచ్చారు.

ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న సిపిఎం ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- కూనవరం : ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో తాగు, సాగునీరు, రహదారులు, ఇతర సౌకర్యాల కల్పనకు ఐటిడిఎ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాలని సిపిఎం కూనవరం మండల ప్రజా ప్రతినిదులు డిమాండ్ చేసారు. ఆదివారం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపిటిసిలు అమ్మాజీ, జయసుధ, సర్పంచ్‌లు నాగమణి, వెంకమ్మ, రామారావు, సోడే శంకర్ మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తరువాత ఐటిడిఎ పాలక మండలి సమావేశాలను పెట్టి, గిరిజన ప్రాంతంలో సమస్యలు పరిష్కారానికి చర్చించకపోవడం గిరిజన సమస్యలపై పాలక పక్షాలు, ప్రభుత్వాల నిర్లక్ష్యధోరణికి అద్దం పడుతోందన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతం మండలాల నుండి గెలిచిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయింపునకు ప్రభుత్వాలు, నేతలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

సిద్ధం సభలో ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అరకులోయ:రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు.అరకులోయలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో వైసిపి బలంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. బాక్సైట్ జిఒను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలో వచ్చిన వెంటనే రద్దు చేశారని ఆయన గుర్తు చేశారు. గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతోనే పాడేరులో 500 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేశారని ఆయన అన్నారు. గిరిజన యువతకు 100 శాతం ఉద్యోగాలు వచ్చే జీవో 3 పునరుద్ధరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు బాక్సైట్ తవ్వకం పై దృష్టి పెడితే వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు అండగా నిల బడిందన్నారు.అరకు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అబివృద్ధి చేయడానికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం గిరిజనులకు ఎన్నో పథకాలు అందిస్తుందని తెలిపారు. అరకు సమన్వయకర్త రేగమస్యలింగం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, అరకు నియోజకవర్గ పరిశీలకు రాలు శోభ హైమావతి దేవి, విశాఖ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర,పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జిసిసి చైర్మన్ శోభా స్వాతిరాణి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లి సురేష్, నాయకులు ,అదిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

కొత్తపల్లి గీతకు ఎంపీ టికెట్ ఇస్తే ప్రతిఘటన

- ఆదివాసీ గిరిజన సంఘం నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సూరిబాబు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అరుకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత నిజమైన గిరిజనరాలు కాదని, అటువంటి వ్యక్తికి అరకు ఎంపీ స్థానం నుంచి పోటీకి బిజెపి టిక్కెట్ ఇస్తే మన్యవాసుల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని ఆదివాసీఈ గిరిజన సంఘం మండల కార్యదర్శి కోండ్ల సూరిబాబు హెచ్చరించారు. ఆదివారం రాజవొమ్మంగి ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన సంఘం మండల సమావేశంలో మాట్లాడుతూ, ఎస్టి కాదని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొత్తపల్లి గీతకు ఎంపీ టిక్కెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే జిఒ 3రద్దు, గిరిజనేతల కులాలను ఎస్టి జాబితాలో చేర్చడం, కనీస మౌలిక సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వంటి ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటున్న పాలక పార్టీలు, ఇపుడు గిరిజనులకు అన్యాయం చేస్తూ గిరిజనేతరురాలైన కొత్తపల్లి గీతకు టిక్కెట్ ఇస్తే గిరిజనుల మనోభావాలను దెబ్బతీసినట్లేనన్నారు. దీనికి తగు పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఆదివాస గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: రోడ్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. అనంతగిరి పంచాయతీ మాలింగవలస, పాతకోట, రేగం, నందిగుమి, తేనెపుటు, తెల్లరపాడు గ్రామాల్లో ఆదివారం సీపీఎం బృందం పర్యటించింది. అనంతరం గ్రామస్తులతో రేగంలో సమవేశమై పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ రోడ్డు పనులు ఏళ్ల తరబడి నిలిచి పోయాయని తెలిపారు. అనంతరం గంగరాజు గిరిజనులతో మాట్లాడుతూ, ప్రభుత్వం మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా పివిటీజి గ్రామాలకు రోడ్డు నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం ద్వారా 2 కోట్లా 16 లక్షల నిధులు మంజూరు కాగా ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు తప్పుడు బిల్లులు చెల్లించి నిధులు స్వాహా చేశారని విమర్శించారు. రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిపి వేశారని, దీంతో వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. రోడ్డు నిర్మాణాలకు కోట్లు ఖర్చు పెట్టినా అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. పివిటిజి గ్రామాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించినా రోడ్డు నిర్మాణాలు చేపట్టలేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు ముందుకు సాగలేదన్నారు. బిల్లులు యధావిధిగా అప్‌లోడ్ చేస్తూ నిదులు దారి మళ్లించారని విమర్శించారు. తన పర్యటనలో వెలుగు చూసిన సమస్యలను జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర , జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిలకు తెలియజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమ్మెల నాగులు, వైస్ సర్పంచ్ పాంగి అర్జున్ గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు, సోమెల రాంబాబు, ధర్మన్న, డి.దేముడు, పి.పండన్న పాల్గొన్నారు.

మన్యంలో ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి -జి.మాడుగుల:ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నుర్మతి అవుట్ పోస్ట్, మెయిన్ రోడ్డు కల్వర్టు, బస్టాండ్లను బాంబ్ డిస్పోజల్ టీం డాగ్ తో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ, కొత్త వ్యక్తులు గ్రామాలలోకి వస్తే సమాచారం చేరవేయాలన్నారు. సీఐ చేతుల మీదుగా పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్

ఇన్నాళ్లూ ఏం ఒరగబెట్టారని..?

- ఎక్కడి సమస్యలు అక్కడే... అమలు కాని హామీలు
- పట్టని నిర్వాసితులు, ముంపు బాధితుల గోడు
- అయినా రోడ్‌షోలు, ప్రచార సభలతో ప్రజల్లోకి
- ఓట్ల కోసం నేతల హడావిడిపై జనం పెదవివిరుపు

ప్రజాశక్తి-విఆర్.పురం: ప్రజలకిచ్చిన హామీల అమలులో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంటూరు కాకి లెక్కలు చెప్పి, అడ్డగోలు సర్వేలతో అర్హులైన ఏ ఒక్క గ్రామానికి, ఇళ్లకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా, ఇపుడు ఎన్నికలొచ్చేసరికి ఏదో వెలగబెట్టామంటూ అధికార పక్షం నేతలు రోడ్‌షోలు, పర్యటనలకు రావడంపై మండిపడ్డారు. నిర్వాసిత గ్రామాల్లోని రోడ్లను ఏం అభివృద్ధి చేశారని రోడ్డు షోలు నిర్వహించేందుకు వస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఏజెన్సీ గిరిజన గ్రామాలు, పోలవరం ముంపు గ్రామాల ప్రజలు కనీస సౌకర్యాలు లేక సవాలక్ష సమస్యలతో సతమతమౌతున్నా నేతలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దమటపల్లి నుండి కుందులూరు, ములకనపల్లి, తెల్లవారిగూడెం, కారం గూడెం రహదారులే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. పునర్నిర్మాణం పేరిట ఉన్న రోడ్లను తవ్వి వదిలేసారే తప్ప, వాటిని పూర్తిచేసే చర్యలు చేపట్టలేదని మండిపడుతున్నారు. శిలాఫలకాలు, శంకుస్థాపనలతో ఐదేళ్లు హడావిడి చేశారే గానీ, పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చి ఎన్నిరోడ్లు బాగుచేశారో పాలకపక్షం నేతలు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. సిద్ధం సభలు, వాహన ప్రచారయాత్రలు, రోడ్ షోలు అంటూ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి ఎమ్మెల్సీ అనంతబాబు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రజా సంఘాలు గుర్రుమంటున్నాయి. నేతలకు ప్రజల ఓట్లు కావాలే తప్ప, అభివృద్ధి, జనం బాగోగులు పట్టడం లేదని మండల ప్రజలు గిరిజనుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుందులూరు వరకు తవ్వి వదిలేసిన రోడ్డు

మాయమౌతున్న మహా వృక్షాలు

జాతీయ రహదారి విస్తరణలో కొట్టేసిన భారీ మర్రిచెట్టు



ఆంధ్రాబ్యాంకు జంక్షన్‌లో కొట్టేసిన భారీ మర్రిచెట్టు

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో నిత్యం వందలాది మందికి నీడనిచ్చే ఏళ్లనాటి మరువక్షం ఆదివారం నేలకొరిగింది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా ఉన్నే వందేళ్లపైబడిన భారీ మర్రివృక్షం కొట్టేశారు. ఆంధ్ర బ్యాంకుకు వచ్చే వందలాదిమంది వినియోగదారులకు, చిరు వ్యాపారులకు నీడనిచ్చే ఈ వృక్షం కూల్చివేతతో పలువురు ఆవేదన వెలిబుచ్చారు. ఎక్కడ నుంచి వచ్చినా పాదచారులు, బాటసారులు, వాహనదారులకు ఆసరాగా, నీడనిచ్చే చెట్టు కొట్టేయడాన్ని బ్యాంకు వినియోగదారులు మండల వాసులు, వృక్షప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొట్టేయడం సులువేగానీ, ఇలాంటి వృక్షాలను పెంచడం ఎంత కష్టమోనని పలువురు అంటున్నారు. భారీ వటవృక్షం కూల్చివేతతో ఈ జంక్షన్‌లో నిలువనీడ లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు.

నేడు ఐటిడిఎ వద్ద ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి -రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ ఎదుట ఈ నెల4న సోమవారం జరిగే ధర్నా, ర్యాలీకి ఆదివాసీలు పెద్దఎత్తున తరలిరావాలని ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొండ్లా వర ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. రద్దు చేసిన జిఒ 3 పునరుద్ధరణకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించుకోవడం, ఇతర సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జెఎసి, ఆదివాసీ సంఘాల జెఎసి, అఖిలపక్ష నేతలు, నిరుద్యోగులు ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళనకు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముస్లిముల చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- చింతూరు: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఆదివారం ముస్లిములు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు యాసీన్ మస్జిద్ కమిటీ సభ్యులు జిక్రియా, పేషిమాం అహమ్మద్ రెహమాన్, ఎండి జవహర్, ఎస్‌కె.సుబానీ తెలిపారు.

ఘనంగా కనకదుర్గమ్మ రజతోత్సవం

ప్రజాశక్తి -చింతూరు.: మండల కేంద్రంలోని శబరినది ఒడ్డున ఉన్న కనకదుర్గమ్మ ఆలయ 25వ వార్షికోత్సవ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈనెల 1న శుక్రవారం ప్రారంభమై, హోమాలు, ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం శోభాయాత్ర ఊరేగింపు నిర్వహించి, రావిచెట్టు దరి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శబరినది జలాలతో సహస్త్ర ఘటాభిషేకం చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేడుకలోఒడిశా,ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఆంధ్రాలోని పలుప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు

వైభవంగా అడవిరాజుల బాబు పండగ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:ముండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి, శరభవరం, చికిలింత, లోదొడ్డి తదితర ప్రాంతాల్లో అడవి రాజులబాబు పండుగను గిరిజనులు, గిరిజనేతరలు కులమతాలకు అతీతంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు, జీడి, మామిడి తోటలు, పంట పొలాల వద్ద ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేసవిలో గిరిజనులు అటవీ ఉత్పత్తులు, ఇతర పంటలు, ఫలాల సేకరణకు అడివిలోకి వెళ్లే క్రమంలో ఎటువంటి ప్రమాదం, ఆపద జరగకుండా ఉండాలని, అలాగే జీడి మామిడి, మామిడి తోటలు బాగా కాసి ఫలసాయం,దిగుబడులు బాగా రావాలని కోరుతూఈ పండుగను నిర్వహిస్తుంటారు గిరిజనులు గిరిజనేతరులు సమూహంగా పంట పొలాల వద్ద చెట్టు కింద పూజలు నిర్వహిస్తారు, మొక్కులు తీర్చుకుంటారు, పెద్దలు,మహిళలు, చిన్నారులు సహపంక్తి భోజనాలు చేస్తారు. అందరూ సమూహంగా కల్లు తాగుతారు.

పండగలో అపశృతి : గుండెపోటుతో వృద్ధుడు మృతి

రాజవొమ్మంగి: అడవి రాజులబాబు పండగలో అపశృతి చోటుచేసుకుంది. మండలంలోని గింజర్తి గ్రామంలో ఆదివారం కొంగర భూపతిరెడ్డి (65) అనే గిరిజనుడు తన పొలంలో అడవిరాజుల బాబుకు మొక్కులు తీర్చుకున్న తర్వాత సహఫంక్తి భోజనాలు చేస్తుండగా, అందరూ చూస్తుండగానే గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని గ్రామ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి తెలిపారు. భూపతిరెడ్డి అకాలమరణంలో పండగ పూట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.



మృతుడు భూపతిరెడ్డి



ఉత్తర నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న బొత్స ఝాన్సీ, కెకె.రాజు

ఉత్తరంలో బొత్స ఝాన్సీ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ తన ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రారంభించారు. జివిఎంసి 49వ వార్డు పరిధి ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మధుసూధననగర్ ఆర్చి నుంచి వైసిపి సమన్వయకర్త కెకె.రాజుతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కస్తూరినగర్, శాంతిపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, విఎంఆర్‌డిఎ చైర్మన్ సనపల చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఎ.రెహమాన్, నాయకులు రొంగలి జగన్నాథం, వుడా రవిరాజు, బొడ్డేటి కాశీవిశ్వనాథం, భరణికాన రామారావు, గుంటూరు నరసింహమూర్తి భారతి, బాణాల శ్రీనివాసరావు, కంపా హనుక్, చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, కెవిఎన్.శశికళ, సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యాన 25వ వార్డు పరిధి సీతంపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ప్రారంభించారు. స్త్రీలు, పిల్లలు, దంత, కంటి సంబంధిత సమస్యలను డాక్టర్లు ఎన్.గౌతమ, లుథియా, మెర్సీ, రమేష్ కృష్ణ, సప్పా నరేష్, గంగాధర్ పరీక్షించారు. అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో అధ్యక్షులు కిరణ్ కుమార్, కార్యదర్శి రవికిరణ్ ప్రసాద్, వ్యవస్థాపక అధ్యక్షులు మొదిలి మహేష్, సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

'పీవీ' చరిత్ర తెలియాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ, విదేశాల ప్రజలకు స్ఫూర్తి దాతగా నిలిచిన భారత పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు జీవన విధానం, చరిత్ర నేటి తరానికి తెలియవలసిన అవసరం ఉందని తెలుగుదేశం నాయకులు ఆడారి కిషోర్‌కుమార్ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన పీవీ మనమడు ఎన్‌వి.సుభాష్‌ను ఆడారి కిషోర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పీవీ నరసింహారావుకు భారత రత్న పురస్కారం లభించడం దేశ ప్రజలకు గౌరవమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పీవీ ప్రభావంపై వక్తృత్వ, వ్యాస రచన, అవగాహన సదస్సులు నిర్వహించే విధంగా కృషి చేయాలన్నారు.

విద్యుత్ వైర్లతో భయాందోళన

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ రహదారిలో వేలాడుతున్న విద్యుత్ వైర్లుతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామానికి వెళ్లే రహదారి పక్కన విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో బస్సులు, భారీ వాహనాలకు తగిలే అవకాశం ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నివారణ చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని, ప్రమాదాలు జరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ సర్పంచ్ బర్రెడ్డి మల్లికార్జునరావు, గ్రామస్తులు కోరుతున్నారు.



బస్సుకు అందిన ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు

గాజువాక - అగనంపూడి సర్వీస్ రోడ్డు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి- గాజువాక : పాత గాజువాక నుంచి అగనంపూడి వరకు సర్వీస్ రోడ్డును ఏర్పాటుచేయాలని వార్వా, నివాస్, గాజువాకలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తీర్మానం చేశారు. గాజువాక సెలెస్ట్ కాంప్లెక్స్‌లో వార్వా, నివాస్ ఆధ్వర్యాన కాలనీ అసోసియేషన్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పలు తీర్మానాలు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండేలా కేంద్ర ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేయాలని, చెత్త, ఆస్తి పన్ను రద్దుచేయాలని, ఇంటి పన్నునే మళ్లీ పునరుద్ధించాలని, ట్రు ఆఫ్, ఫ్యూయల్ చార్జీలు, టోల్, పార్కింగ్, యూజర్ ఛార్జీలు రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. పట్టణ సంస్కరణలను ఉపసంహరించుకోవాలని, గాజువాకలో స్టేడియం నిర్మించాలని, కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ వరకు రోడ్డు విస్తరించాలని, గాజువాకలో మత్తుమందులను నిరోధించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న యుజిడి పనులు పూర్తిచేయాలని, లైబ్రరీ ఏర్పాటు, సంతలు నిర్వహించేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని, గాజువాకలో రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేయాలని కోరారు.

తోకాడలోని సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తమ అపార్ట్‌మెంట్‌కు జివిఎంసి, ఐలా సరిహద్దు సమస్య ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారానికి పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. తాము చెత్త పన్ను చెల్లించలేదని, తమను చూసి మరో నాలుగు అపార్ట్‌మెంట్లు కూడా చెల్లించడంలేదని వివరించారు. దీనిపై రాబోయే రోజుల్లో పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

వార్వా ఉపాధ్యక్షులు లక్ష్మణస్వామి మాట్లాడుతూ, విశాఖ డెయిరీ వల్ల గాజువాకతో పాటు అనేక ప్రాంతాలు కాలుష్యమయం అయ్యాయన్నారు.



సమస్యను వివరిస్తున్న సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

షీలానగర్ అసోసియేషన్ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, తమకు శ్మశాన వాటిక సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. స్నేహపూర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పివైవి రమణారావు మాట్లాడుతూ, మంచినీటి సమస్య, కాలువలో చెత్త సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. రానున్న ఎన్నికల్లో అభ్యర్థులు ఈ సమస్యలను మేనిఫెస్టోలో పొందుపరిచేలా మనం డిమాండ్ చేయాలని తీర్మానించారు. జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వార్వా, నివాస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీబీ గణేష్, పిట్ట నారాయణమూర్తి, నాయకులు బి.గుర్రప్ప, ఎస్‌వికె.పరుశురాం, త్రినాథ్‌స్వామి, కె.కిరీటం, కె.సంతోషం, బి.తౌడన్న, బంగారునాయుడు, పల్లెలు నర్సింగరావు, పాల్గొన్నారు.

పెయింటర్స్ అసోసియేషన్ ఏర్పాటు



పెయింటింగ్ కార్మికులతో ఎం.రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం గాజువాకలోని పెయింటర్లతో సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పెయింటింగ్ కాంట్రాక్టర్స్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ (సిఐటియు) గాజువాక జోన్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెయింటర్లు సంఘంగా ఏర్పడితే గుర్తింపు ఉంటుందన్నారు. కార్మికులకు సంఘం యొక్క విశిష్టతను తెలిపారు. రాష్ట్రంలో కొన్ని వేల మంది పెయింటింగ్ కార్మికులు ఉన్నా గుర్తింపు లేదన్నారు. యూనియన్ పెట్టుకొని అందరూ ఏదో ఒక సంఘంలో ఉంటే గుర్తింపు లభిస్తుందని వివరించారు. భవిష్యత్తులో విశాఖ జిల్లాలో ఉన్న కార్మికులను ఐక్యం చేసే సంఘం సభ్యత్వం తీసుకునేటట్టు మీరందరూ కృషి చేయాలని రాంబాబు సూచించారు. ఎవరికి ఎక్కడ ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ సంఘం నాయకులు ముందుకెళ్లాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనకరాజు టోనీ బెహరా, కృష్ణ, చలపతి, రాజు, పెయింటింగ్ కార్మికులు పాల్గొన్నారు.

నాకు టికెట్ రాకుండా తిప్పల యత్నం

వైసిపి గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనకు టికెట్ రాకుండా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని గాజువాక వైసిపి సమన్వయకర్త ఉరుకూటి చందు ఆరోపించారు. జివిఎంసి 66వ వార్డు పరిధిలో ఆదివారం ఏర్పాటుచేసిన వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన కుటుంబం మూడు తరాలుగా రాజకీయంలో ఉందన్నారు. తనకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించడంతో ఎమ్మెల్యేగా టికెట్ రాకుండా చేసి మేయర్‌ను గాజువాక తీసుకొచ్చేలా తిప్పల నాగిరెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనకు మద్దతు తెలిపిన కార్పొరేటర్లను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు సహకరించకుండా ఏకపక్షంగానే నిర్ణయాలు తీసుకుని ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, గాజువాకకు చెందిన వ్యక్తిని కాకుండా మేయర్‌ను పోటీకి పెడితే ఏం లాభం అని ప్రశ్నించారు. మేయర్ నగరమంతా వదిలి గాజువాకలో శంకుస్థాపనలు చేయడమేమిటన్నారు. కార్యకర్తలు చందుకు బాసటగా నిలిచారు.

నేరాలు ఘోరాలు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -రావికమతం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని తట్టబంద పంచాయతీ బూరుగుపాలెంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన నమ్మి అప్పలనాయుడు పూరింటిలో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో, ఇంట్లో నిత్యావసర వస్తువులు, సామగ్రి, లక్ష యాభై వేల రూపాయల నగదు, బంగారం దగ్ధమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్ గోకివాడ రమణ బాధితులను పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరారు.

అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిని ఎన్నుకోండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో 'ఓటు హక్కు వినియోగం'పై నైస్ మేన్ పవర్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ, ఒక్క ఓటుతోనే ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యాన్ని ఓటర్లందరూ విడనాడాలని, ఆ ఒక్క ఓటే అందరి భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రజలకు మేలు చేసే నేతలకు పట్టం కట్టాలన్నారు. ఓటు అనే రెండక్షరాలకు దేశ పరిపాలన గతిని, దశ దిశను మార్చే శక్తి ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర చట్టసభలలో, స్థానిక స్వపరిపాలనా సంస్థల్లో అనేక విప్లవాత్మకమైన మార్పులకు ఓటు హక్కు నాంది పలికిందనిఅన్నారు. విద్యాసంస్థల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్బు ఏర్పాటు, స్వీప్, నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్, సెంట్రలూజ్డ్ యూనిక్ డేటాబేస్ సిస్టమ్, సువిధ పోర్టల్, సి-విజిల్ మొబైల్ యాప్, పీడబ్ల్యుడీ మొబైల్ యాప్, 1950 యూనిక్ నంబరు కలిగిన కాల్ సెంటర్ ఏర్పాటు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు, వెబ్ బేస్డ్ కార్యక్రమాలు ద్వారా ఓటర్ల నమోదు వేగవంతంగా జరుగుతుందన్నారు .కార్యక్రమంలో ఇంగ్లీష్ శిక్షకురాలు బి.నేహ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై వ్యతిరేకత తగదు

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రాజ్యాంగంపై వ్యతిరేకత తగదని ప్రముఖ రచయిత గుంటూరు లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన భీమ్ సేన వార్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'భారత రాజ్యాంగం- అవగాహన- ఉద్దేశపూర్వక వక్రీకరణలు' అంశంపై ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే కులనిర్మూలన పోరాటాలను వ్యతిరేకించినట్టేనన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులు, అవకాశాలు కల్పించిందన్నారు. గుజరాత్ ముస్లిములపై దాడి చేసిన కేసులో శిక్ష పడి తిరిగి విడుదలైన వారిని మళ్లీ జైలుకు పంపించిన ఘనత రాజ్యాంగానిదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదలు విద్యా, ఉద్యోగ పరంగా అభివృద్ధి సాధిస్తున్నారంటే దానికి రాజ్యాంగమే కారణమన్నారు. కుల, వర్గ, లింగ పీడనల వ్యతిరేక పోరాటాల ఫలితాలు రాజ్యాంగంలో ఉన్నాయన్నారు. మనువాదులు రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర సాగిస్తున్నారని, హిందూ ఓట్ల కోసం ముస్లిములు, క్రైస్తవులు, దళితులపై తీవ్ర ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు.

విజయవాడలో అంబేద్కర్ ఫొటో గ్యాలరీ- ప్రత్యేకతలు అంశంపై ఏయూ ప్రొఫెసర్ పీడీ.సత్యపాల్ మాట్లాడుతూ విజయవాడలో స్థాపించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ స్మృతి వనంలో అనేక చారిత్రక విషయాలు చోటుచేసుకున్నాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన భీమ్ సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు, రిజర్వేషన్లు కల్పించడం వల్ల అణగారిన ప్రజలు అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. 2014లో అధికారంలోచ్చిన బిజెపి నిరంతరమూ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎస్ఆర్.వేమన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, మధు కుంచే, వై.బాలకృష్ణ, ఓంకార్, ప్రసాద్, గుడివాడ అప్పారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్ కల్లాం

విద్య, వైద్యంతోనే రాష్ట్రాల మెరుగుదల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో సుపరిపాలన కోసం మార్పు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్య, వైద్యంతోనే రాష్ట్రాలు మెరుగుపడతాయని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ఎపి సిఎం ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం అన్నారు. 'ట్రాన్స్‌ఫార్మింగ్ గవర్నెన్స్ ఫర్ అజ్ టు అజ్' పేరుతో నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రైతుల మరణాలు ఎందుకు పెరిగిపోతున్నాయో కారణాలు తెలుసుకునేందుకు తాను అనేక అధ్యయనాలు చేశానన్నారు. పెట్టుబడులు లేకపోవడం, రైతు నిరక్షరాస్యుడు కావడం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చలేకపోవడమే కారణంగా తేల్చి ప్రభుత్వాలకు నివేదించానని గుర్తు చేశారు. రైతుల ఆత్మహత్యలకుగల కారణాల్ని గుర్తించి నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్‌ను అమల్లోకి తెచ్చి పేదల కళ్లలో వెలుగులు నింపారని గుర్తు చేశారు. వాటికి ప్రస్తుత సిఎం జగన్ మరింత మెరుగులు దిద్దారన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆచార్య ఎవి.ప్రసన్న కుమార్, నాగార్జున యూనివర్సిటీ మాజీ విసి ఆచార్య బాలమోహన్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

'పీవీ జీవితం ఓ ప్రయోగశాల'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ప్రధాని పివి.నరసింహారావు గొప్ప వ్యక్తి అని, ఆయన జీవితం ఓ ప్రయోగశాల అని రాజ్యసభ మాజీ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. పివి.నరసింహారావుకు భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం దసపల్లా హోటల్లో వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ టీవీ నారాయణ అధ్యక్షతన నిర్వహించిన 'నాలుగు మంచి మాటలు' సమావేశంలో ఆచార్య యార్లగడ్డ మాట్లాడారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావు, సుప్రీంకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది డివిఎస్-ఎస్.సోమయాజులు, పివి మనుమడు ఎన్‌వి.సుభాష్, ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఇలో 9 కోట్ల మంది పెట్టుబడిదారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఇ 9 కోట్ల (90 మిలియన్లు) మంది ప్రత్యేక పెట్టుబడిదారులను అధిగమించిందని ఎన్ఎస్ఇ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ చెప్పారు. నగరంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ శనివారం నాటికి మొత్తం ఖాతాల సంఖ్య 16.9 కోట్లను దాటినట్టు వెల్లడించారు

విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా యార్లగడ్డ



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఆదివారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ హిందీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ వినియోగం, ప్రచారంలో అగ్రభాగాన ఉన్న సంస్థ విశ్వ హిందీ పరిషత్ అని చెప్పారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో భారతీయ సంస్కృతిని హిందీ భాష ద్వారా వ్యాప్తి చేయడానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

వాడవాడలా పల్స్ పోలియో

సీతమ్మధార: స్వర్ణ భారతి సమీపంలోని యుపిహెచ్‌సిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లోనూ, గ్రామ సచివాలయాల్లోనూ పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆయన సతీమణితో కలిసి వెళ్లి కుమార్తెకు పోలియో చుక్కలు వేయించారు.



విశాఖలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

24వ వార్డు పరిధి రేసపువానిపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సూర్యనగర్-2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన పల్స్ పోలియో నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావు, పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 3292 మంది పిల్లల లక్ష్యంగా పోలియో చుక్కలు వేశారు. మద్ది గ్రామంలో ఎంపిపి రాంబాబు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

ఆనందపురం : మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు నేతృత్వంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపట్టారు. ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు అన్ని గ్రామాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆనందపురంలో స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, ఎల్‌వి.పాలెంలో సర్పంచ్ లోడగల రాజేశ్వరి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. బోని పరిసర ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తనిఖీచేశారు.

తగరపువలస : భీమిలి మండలం తాళ్ళ వలస పిహెచ్‌సిలో పల్స్ పోలియో కేంద్రాన్ని వైద్యాధికారి డాక్టర్ ఎబి మల్లికార్జునరావు ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో ఎఎన్ఎం, ఆశా, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్త సేవలందించారు. తగరపువలస పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద పోలియో కేంద్రాన్ని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ప్రారంభించారు. వైద్యులు సుస్మిత ఆధ్వర్యాన పోలియో చుక్కలు వేశారు. భీమిలి సిహెచ్‌సిలో కేంద్రాన్ని వైద్యాధికారి డాక్టర్ వైడి కల్యాణి ప్రారంభించారు. వైద్యులు కళ్యాణ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు. పిహెచ్‌సి, సిహెచ్‌సి పరిధిలో పోలియో కేంద్రాల వద్ద సేవలందించిన 455 మందికి చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన మధ్యాహ్నం ఆహార పొట్లాలు, మజ్జిగ పేకెట్లు, వాటర్ బాటిళ్ల అందజేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ సిఎస్ఆర్ ప్రతినిధి కె.నరసింహ పాల్గొన్నారు.

మధురవాడ : 5,7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్ళా మంగమ్మ ఆధ్వర్యాన పల్స్ పోలియో కార్యకమాన్ని ప్రారంభించారు. మధురవాడ, ఉడాకాలనీ, వాంబే కాలనీ, బొట్టవాణిపాలెం, శివశక్తినగర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పలు అంగన్వాడీ కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు.

దేవరాపల్లి: మండలంలోని తారువ గ్రామంలో పల్స్‌పోలియోను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండల కేంద్రంలో ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

మునగపాక: స్థానిక పిఎసిఎల్ ఆవరణలో పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా కుష్టువ్యాధి నివారణ అధికారి ఎంఎస్‌వికె.బాలాజీ, ఎన్‌హెచ్ఎం డిపిఒ జగదీష్ పరిశీలించారు.కార్యక్రమంలో ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహనరావు, ఎంపిటిసి బోడకుర్తి గణేష్, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చంనాయుడు వైద్యాధికారులు విమలగిరి, దుర్గాప్రవల్లిక, సిహెచ్ఒ దేవకాంత, పిహెచ్ఎన్ అనూరాధ, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, ఎఎన్ఎం లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కశింకోట: మెయిన్‌రోడ్డులోని పల్స్‌పోలియో కేంద్రంలో ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యానాయుడు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండల ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, డాక్టర్ తిరుపతిరావు, సర్పంచ్ జయ రజని బయ్యవరంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, తాళ్ళపాలెంలో డాక్టర్ రమేష్ పోలియో చుక్కలు వేశారు.

బుచ్చయ్యపేట: మండలంలోని తురకలపూడిలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పల్స్‌పోలియోను ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.కందిపూడిలో జెడ్పిటిసి దొండా రాంబాబు ప్రారంభించారు వైద్యాధికారులు వెంకటకష్ణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో పోలియో కార్యక్రమం విజయవంతమైందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి గోవిందరావు తెలిపారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.బికేపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు. సుంకపూరులో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నక్కపల్లి: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. మండలంలోని గుల్లిపాడులో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్యులు రజని, సురేఖ అధ్వర్యంలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు పాల్గొన్నారు.

వడ్డాది: బుచ్చయ్యపేట మండలం వడ్డాది పీహెచ్సీ పరిధిలో వడ్డాది, బంగారు మెట్ట ఎల్బీ అగ్రహారం, లోపూడి తదితర గ్రామాల్లో పోలియో చుక్కలు వేశారు. జెడ్పిటిసి దొండ రాంబాబు, సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ జగ్గారావు, వైసిపి నేత దొండా నారాయణమూర్తి పాల్గొన్నారు.

విఆర్ పురం: మండలంలోని రేఖపల్లి పంచాయతీ అన్నవరం, సుద్ధగూడెం, ఉమ్మిడివరం గ్రామాల్లో సర్పంచ్ పూనెం సరోజిని పల్స్‌పోలియోనుప్రారంభించి,. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్త,. ఆశా వర్కర్ పాల్గొన్నారు.

సీలేరు : జికె.వీధిమండలంలోని దారకొండ పిహెచ్‌సి పరిధిలో 1490 మంది చిన్నారులకు, 98శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ డికె. హిమబిందు తెలిపారు. దారకొండ పిహెచ్‌సి, సబ్‌సెంటర్లలో పల్స్‌పోలియోను ప్రారంభించి, పర్యవేక్షించారు. సర్పంచ్ రాజు, ఎంపిటిసి, వైసిపి నేతలు ఎంపిహెచ్ఇఒ పోతురాజు, పిహెచ్ఎన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పిలు లవ కుమారి, నాగమణి, ఎఎన్ఎంలు కళావతి, కొండమ్మ, ఈశ్వరి, సీత, శోభ పాల్గొన్నారు.

వైద్యాధికారుల ఆలస్యంపై ఆగ్రహం

పల్స్‌పోలియోాకు వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్‌వలీ, సౌమ్య ఆలస్యంగా రావడంపై ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీలేరు సంత, చింతపల్లి క్యాంపు, బూసుకొండ ప్రాంతాల్లో పల్స్‌పోలియో కేంద్రాలను పరిశీలించామని, వైద్యాధికారి ఆలస్యంగా రావడం సరికాదన్నారు.

పాడేరు: శత శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. స్థానిక చింతలవీధి సబ్ సెంటర్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1,23,673 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించామన్నారు. 2232 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు.జిల్లాలో 97.6 శాతం మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా తెలిపారు. 1,20,722 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాధన పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ, కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలు చోట్ల పోలియో చుక్కలను వేశారు. మండల కేంద్రంలో స్థానిక పోతంగి పంచాయతీ సర్పంచ్ వెంకట్రావు పోలియో చుక్కలను వేసి ప్రారంభించారు.వైద్యాధికారులు రాంబాబు, అంబిక పాల్గొన్నారు.

పెదబయలు : సీతాగుంట పంచాయతీ పరిధి అంబేద్కర్ పార్క్ ఆవరణలో పోలియో చుక్కలు వేశారు. 66 బూత్‌లలో 3321 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి సునీల్ కుమార్ తెలిపారు.

హుకుంపేట: మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్, తదితర చోట్ల పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ జమాల్‌బాషా మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కలపై అపోహలు వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి పాల్గొన్నారు.

అనంతగిరి: అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 46 పోలియో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో 2201 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వైద్యులు జ్ఞానేశ్వరి, జాహ్నవి, భార్గవి పాల్గొన్నారు.



దేవరాపల్లి మండలం తారువలో పోలియో చుక్కలు వేస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి